సాక్షి
అనంతపురం
ఆదివారం । 13 । ఆగస్టు । 2023



చీనీ టన్ను రూ.15,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.15,500 పలికాయి.



టమాట కిలో రూ.53

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.53 పలికింది. మార్కెట్‌కు 1,950 టన్నుల సరుకు అమ్మకానికి వచ్చింది.

గరిష్టం/కనిష్టం
36.2°/ 22.8°

జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా తగ్గింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

కాచిగూడ- విల్లాపురం మధ్య ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు : వరుస సెలవుల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని కాచిగూడ – విల్లాపురం మధ్య ఈ నెల 14, 15 తేదీల్లో ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ రాకేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 14న సాయంత్రం 5.45 గంటలకు కాచిగూడ జంక్షన్ నుంచి రైలు (నంబర్ 07424) బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.30గంటలకు విల్లాపురం చేరుకుంటుందని పేర్కొన్నారు. తిరిగి విల్లాపురం జంక్షన్ నుంచి 15న సాయంత్రం 4.50 గంటలకు రైలు (నంబర్ 07425) బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12.30 గంటలకు కాచిగూడ చేరుతుందని తెలిపారు. ఈ రైలు సికింద్రాబాద్, బేగంపేట్, లింగంపల్లి, శంకరపల్లి, వికారాబాద్, తాండూరు, శిరం, యాదగిరి, రాయచూరు, మంత్రాలయం, ఆదోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, రేణిగుంట, కాట్పాడి మీదుగా విల్లాపురం చేరుతుందని వివరించారు.

పైపింగ్ పూడ్చివేత



బొమ్మనహాళ్: ఉంతకల్లు సమీపంలో హెచ్చెల్సీకి పడిన పైపింగ్ పూడ్చివేత శనివారం పూర్తి చేశారు. శుక్రవారం తెల్లవారుజామున పడిన ఈ పైపింగ్‌ను పూడ్చివేయడానికి హెచ్చెల్సీ డీఈఈ మద్దిలేటి, జేఈలు గోపాల్ నాయక్, అల్తాఫ్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. సరిహద్దులో 1,800 క్యూసెక్కులు వస్తున్న నీటి ప్రవాహాన్ని తగ్గించిన తర్వాత జేసీబీ సాయంతో ఇసుక, మట్టి బస్తాలు వేసి రంధ్రాన్ని పూడ్చివేశారు. ప్రస్తుతం ఆంధ్రా సరిహద్దులోని 105వ కిలోమీటర్ వద్ద 1,200 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

‘1962’లో ఉద్యోగావకాశాలు

అనంతపురం అగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 1962 హెల్ప్‌లైన్ కింద ప్రవేశపెట్టిన డాక్టర్ వైఎస్సార్ మొబైల్ వెటర్నరీ అంబులేటరీ క్లినిక్‌లో ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. ఈ మేరకు శ్రీసత్యసాయి జిల్లా ఇన్‌చార్జి రామకృష్ణ గౌడ్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఓడీ చెరువు, తలుపుల కేంద్రంగా పనిచేస్తున్న రెండు వాహనాలకు పశువుల డాక్టర్లు (వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్–వీఏఎస్) రెండు పోస్టులు, చెన్నేకొత్తపల్లి కేంద్రంగా పనిచేస్తున్న మరో వాహనానికి డ్రైవర్ (పైలట్) పోస్టు ఖాళీగా ఉంది. డాక్టర్ పోస్టుకు బీవీఎస్సీ కోర్సు చేసిన వారు అర్హులు. అలాగే పది ఉత్తీర్ణతతో పాటు హెవీ డ్రైవింగ్ కలిగిన వారు పైలట్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవచ్చు. రెండు జిల్లాల పరిధిలో అర్హత, ఆసక్తి ఉన్న వారు 96525 33554 నంబరులో సంప్రదించవచ్చు.

చెరువులకు పునరుజ్జీవం

- 75 చెరువుల్లో ‘అమృత్ సరోవర్’ పనులు పూర్తి
- రూ.7.04 కోట్లు ఖర్చుచేసిన అధికారులు
- పూడికతీతతో పెరగనున్న భూగర్భ జలాలు



- సుందరంగా కనిపిస్తున్న రాయలకాలం నాటి ఈ చెరువు గుమ్మఘట్ట మండలం భూపసముద్రంలోనిది. 108 ఎకరాల విస్తీర్ణంలో రూ.31 లక్షల వ్యయంతో ‘అమృత్ సరోవర్’ ద్వారా ఆధునికీకరిస్తున్నారు. ఇన్నాళ్లు పాడుబడ్డ చెరువుకు ఒక్కసారిగా మహర్దశ కలిగింది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చెరువు పనులను సీఆర్‌డీ టీమ్‌లీడర్ లీలావతి, సీడీసీఎల్ ఆర్‌సీ మల్లీశ్వరి ఇటీవల పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.



జలకళతో కనిపిస్తున్న ఈ చెరువు గుమ్మఘట్ట మండలం నేత్రపల్లిలోనిది. అమృత్ సరోవర్ పథకం ద్వారా గతేడాది 15 ఎకరాల విస్తీర్ణంలో రూ.10 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టారు. చెరువులో పూడిక తొలగించడంతో నీటి నిల్వ పెరిగి చుట్టూ భూగర్భజలాలు వృద్ధిలోకి వచ్చాయి.

రాయదుర్గం: రాయలకాలం నాటి చెరువులకు మహర్దశ పట్టింది. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వం ద్వారా అందివచ్చిన ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకుని చెరువులను సుందరీకరిస్తున్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా అమృత్ సరోవర్ కార్యక్రమం కింద జిల్లాలో పురాతన చెరువులను గుర్తించి, వాటిని అభివృద్ధి చేయడం, పునరుజ్జీవం పెంపొందించడం కోసం చర్యలు చేపడుతున్నారు. అమృత్ సరోవర్ కింద జిల్లాలో 77 చెరువులను ఎంపిక చేసి, అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.11.61 కోట్లు అవసరమని ప్రతిపాదించారు. గత ఏడాది (2022–23) 23, ప్రస్తుత ఏడాది (2023–24)లో 54 చెరువుల్లో పనులు చేపట్టారు. మొత్తం మీద 75 చెరువుల్లో పూడికతీత, నీటి నిల్వ పటిష్టతకు సంబంధించిన పనులు పూర్తి చేశారు. ఇందు కోసం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) ద్వారా రూ.7.04 కోట్లు వెచ్చించారు. మరో రెండు చెరువుల్లో అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయి. ఇందులో గుమ్మఘట్ట మండలం భూపసముద్రం చెరువులో చేపట్టిన అభివృద్ధి పనులు జిల్లాకే ఆదర్శంగా నిలిచాయి.

పెరగనున్న భూగర్భజలాలు

అమృత్ సరోవర్ ద్వారా చెరువుల్లో చేపట్టే అభివృద్ధి పనులతో భూగర్భ జలాలు పెరిగి సాగు, తాగునీటి కష్టాలు తీరనున్నాయి. గతేడాది కురిసిన భారీ వర్షాలకు చెరువులన్నీ నిండుకుండను తలపించాయి.

లక్ష మొక్కలతో పచ్చదనం..

దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ‘నాభూమి– నా దేశం’లో భాగంగా జిల్లా నీటియాజమాన్య సంస్థ (డ్వామా) ఆధ్వర్యంలో శిలాఫలకాల ఏర్పాటు, మొక్కలు నాటడం, జెండా ఆవిష్కరణ, పంచప్రాణ్ ప్రతిజ్ఞ, వీరులకు వందనం లాంటి కార్యక్రమాలు పండుగలా నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ పథకం అధికారులు భాగస్వామ్యం అవుతున్నారు. జిల్లాలో సుమారు లక్ష మొక్కలు నాటించి, పచ్చదనం పెంపొందించేలా ప్రణాళికలు చేపట్టారు. సచివాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల వద్ద ఈ కార్యక్రమాన్ని దిగ్విజయవంతంగా పూర్తి చేస్తున్నారు.

తీరనున్న నీటి కష్టాలు



‘నా భూమి – నా దేశం’లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఈ నెల 9 నుంచి 15 వరకు ఐదు అంశాలపై కార్యక్రమాలు నిర్వహించాం. వీటికి విశేష స్పందన లభించింది. అమృత్ సరోవర్ ద్వారా 75 చెరువుల్లో ఆధునికీకరణ పనులు కూడా పూర్తయ్యాయి. తద్వారా తాగునీటి అవసరాలు తీర్చడంతో పాటు భూగర్భ జలాలు వృద్ధిలోకి వస్తున్నాయి. మొక్కలు నాటే కార్యక్రమం యుద్ధప్రాతిపదికన జరుగుతోంది. భూపసముద్రం చెరువు ఆదర్శంగా తీర్చిదిద్దడంతో డాక్యుమెంటరీ చిత్రీకరణ చేయించాం.

– వేణుగోపాల్‌రెడ్డి, డ్వామా పీడీ, అనంతపురం



పనులను తనిఖీ చేస్తున్న సీఆర్‌డీ టీమ్ సభ్యులు

రేపు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాక



అనంతపురం క్రైం: జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈ నెల 14న అనంతపురం వస్తున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో రాయదుర్గం, అనంతపురం, ఉరవకొండ, శింగనమల నియోజకవర్గాల అభివృద్ధికి సంబంధించి నిర్వహించే అధికారిక సమీక్ష సమావేశంలో పాల్గొంటారు.

సెర్ప్ ఉద్యోగుల సంబరాలు



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

అనంతపురం: కనీవినీ ఎరుగని రీతిలో 23 శాతం జీతాలు పెరగడంతో పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగులు, సిబ్బంది సంబరాలు చేసుకున్నారు. జీతాల పెంపుతో జిల్లా వ్యాప్తంగా 261 మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరింది. ఈ సందర్భంగా వారు డీఆర్‌డీఏ కార్యాలయంలో శనివారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సెర్ప్ చరిత్రలో తొలిసారిగా ఫిట్మెంట్ మంజూరు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. తామంతా ముఖ్యమంత్రికి రుణపడి ఉంటామన్నారు. ప్రతిష్టాత్మక నవరత్నాల పథకాల అమలులో మరింత బాధ్యతతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువస్తామన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఐ.నరసింహారెడ్డి, ఏపీడీ ఈశ్వరయ్య, డీపీఎం సత్యనారాయణ, ఏపీఎం మల్లికార్జున, నారాయణస్వామి, సీసీ రామానంద్, అడ్మిన్ రసూల్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత కుటుంబంపై హత్యాయత్నం

- శ్మశాన స్థల కబ్జాను అడ్డుకున్నారని కక్ష
- అదనుచూసి మచ్చుకత్తితో దాడి చేసిన టీడీపీ నేత
- ముగ్గురు నిందితుల అరెస్ట్... రిమాండ్‌కు తరలింపు





తీవ్రంగా గాయపడ్డ వన్నూరుస్వామి, నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ లక్ష్మన్న

బొమ్మనహాళ్/రాయదుర్గం: శ్మశానస్థల కబ్జాను అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వన్నూరుస్వామి కుటుంబంపై టీడీపీ నేత పూజారి నాగరాజు హత్యాయత్నం చేశాడు. మచ్చుకత్తి చేత పట్టుకుని విచక్షణారహితంగా దాడిచేసి గాయపరిచాడు. బొమ్మనహాళ్ మండలం ఉప్పరహాళ్‌లో ఈ ఘటన జరిగింది. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉప్పరహాళ్ గ్రామంలో శ్మశాన స్థలాన్ని పూజారి నాగరాజు ఆక్రమించుకున్నాడు. దాన్ని ఎలాగైనా విడిపించాలని స్థానికులు వైఎస్సార్‌సీపీ నాయకుడు వన్నూరుస్వామిని ఆశ్రయించారు. ఆయన గ్రామస్తుల తరఫున ఇటీవల తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టి శ్మశాన స్థలానికి హద్దులు ఏర్పాటు చేయడంతో పాటు కబ్జాదారుకు హెచ్చరికలు జారీ చేశారు. దీన్ని జీర్ణించుకోలేకపోయిన నాగరాజు అప్పటి నుంచి వన్నూరుస్వామిపై కక్ష పెంచుకున్నాడు. ఎలాగైనా అతడిని అడ్డు తొలగించుకుని, గ్రామంలో తనకు ఎదురులేకుండా చేసుకోవాలనుకున్నాడు.

రెచ్చగొట్టి.. గొడవకు ఆజ్యం పోసి..

శుక్రవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో టీడీపీ నాయకుడు నాగరాజు పథకం ప్రకారం వన్నూరుస్వామిని రెచ్చగొడుతూ గొడవకు ఆజ్యం పోశాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. ఈ క్రమంలో అప్పటికే సిద్ధంగా ఉంచుకున్న మచ్చుకత్తితో నాగరాజు విరుచుకుపడ్డాడు. వెనుకనుంచి వచ్చి నరకడంతో వన్నూరుస్వామి కుడి చెయ్యి తెగి తీవ్రరక్తస్రావమైంది. రక్షించేందుకు ప్రయత్నించిన ఆయన భార్య మారెక్క, బంధువులు తిప్పేస్వామి, ఓబుళస్వామిపైనా నాగరాజు మచ్చుకత్తితో దాడిచేసి గాయపరిచారు. మచ్చుకత్తితో వీరంగం చేస్తూ దాదాపు గంటపాటు భయానక వాతావరణం సృష్టించాడు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని ఆరా తీశారు. గాయపడ్డ బాధితులను ఆస్పత్రికి తరలించారు.

నిందితుల అరెస్ట్

టీడీపీ నాయకుడు పూజారి నాగరాజు, అతడి భార్య శాంతమ్మ, తండ్రి పూజారి మాదయ్య తమను హత్య చేసేందుకు కుట్ర పన్నారని బాధితుడు వన్నూరుస్వామి శనివారం బొమ్మనహాళ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆ ముగ్గురు నిందితులపై 324, 307, ఆర్–డబ్ల్యూ34 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. డీఎస్పీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఎస్‌ఐ శివ ప్రత్యేక బృందంతో నిందితుల కోసం గాలింపు చేపట్టారు. శనివారం మధ్యాహ్నం శ్రీరంగాపురం క్యాంపు వద్ద నిందితులు పూజారి నాగరాజు, అతడి భార్య శాంతమ్మ, తండ్రి పూజారి మాదయ్యను అరెస్టు చేశామని, హత్యాయత్నానికి ఉపయోగించిన మచ్చుకత్తిని స్వాధీనం చేసుకున్నామని సీఐ లక్ష్మన్న తెలిపారు. అనంతపురం మొబైల్ కోర్టులో హాజరుపరచగా.. నిందితుల రిమాండ్‌కు మెజిస్ట్రేట్ ఆదేశించారు.

నేరస్తులకు శిక్ష పడాలి: ఎస్పీ



అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నేరం చేసిన వారికి శిక్ష పడేలా చూడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని ఎస్పీ కె.శ్రీనివాసరావు అన్నారు. శనివారం పోలీసు క్వార్టర్స్‌లోని కాన్ఫరెన్స్ హాలులో పెండింగ్, లోక్ అదాలత్, ప్రాధాన్యత కేసులపై ఎస్పీ కోర్టు కానిస్టేబుళ్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డీజీపీ సంకల్పం మేరకు కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి కేసులో ముద్దాయిలకు శిక్ష పడేలా చూడాలన్నారు. నేరస్తుల్లో భయం కలిగేలా శిక్షలు పడేందుకు అందరూ కృషి చేయాలన్నారు. శిక్షలు పడేలా చూడటంలో కోర్టు కానిస్టేబుళ్ల పాత్ర కీలకమన్నారు. న్యాయం జరిగేంత వరకు మనం బాధితుల పక్షాన నిలవాలన్నారు. కన్విక్షన్ వచ్చే కేసులను ముందుగా గుర్తించాలన్నారు. ట్రయల్ ప్రాసెస్‌ను వీలైనంత మేరకు కుదించాలన్నారు. ప్రాసిక్యూషన్, సాక్షులతో మాట్లాడాలన్నారు. సంబంధిత పోలీసు అధికారులు, ఏపీపీ, పీపీలతో సరైన లైజన్‌తో ముందుకెళ్లాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఆర్.రామిరెడ్డి, న్యాయసలహాదారులు విష్ణువర్ధన్‌రెడ్డి, డీసీఆర్బీసీఐ విశ్వనాథ్ చౌదరి, ఎస్‌ఐ సుమన్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నిఘా పెంచుదాం

స్పెషల్ బ్రాంచ్ సిబ్బందితో ఎస్పీ శ్రీనివాసరావు సమీక్ష నిర్వహించారు. గ్రామాల వారీగా తాజా పరిస్థితులను గుర్తించాలన్నారు. అక్రమ వ్యాపారాలు, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెంచాలన్నారు. అవాంఛనీయ ఘటనలు జరకుండా ముందుస్తుగా సమాచారాన్ని సేకరించాలన్నారు. సమావేశంలో సీఐ జాకీర్‌హుస్సేన్ పాల్గొన్నారు.

అనితకు అండగా..

- స్పందిస్తున్న మానవతావాదులు
- బాధితురాలికి ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పరామర్శ.. ఆర్థికసాయం







అనితను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, తాడిపత్రి డీఎస్పీకి ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న సీఐ హమీద్ ఖాన్, ధరణీబాబు, కానిస్టేబుల్ భాస్కర్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్/రాప్తాడు రూరల్:/ తాడిపత్రి/పెద్దవడుగూరు: ఏఆర్ కానిస్టేబుల్ కిరణ్‌కుమార్ కుటుంబానికి మానవతావాదులు అండగా నిలిచారు. రోడ్డు ప్రమాదంలో భర్త కిరణ్‌కుమార్‌ను కోల్పోయి బెంగళూరులోని ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్న అనిత దుస్థితిని చూసి పోలీస్ శాఖతో పాటు పలువురు మానవతావాదులు స్పందించారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి శనివారం నేరుగా బెంగళూరుకు వెళ్లి అనితను పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం బాధితురాలికి తన వంతు సాయంగా రూ.2 లక్షలు అందజేశారు. ఇద్దరు చిన్నారులకు ధైర్యం చెప్పారు. ఎస్పీ కె.శ్రీనివాసరావు ప్రత్యేక చొరవ తీసుకుని అనిత ఆరోగ్య సంరక్షణకు ఇద్దరు సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. అలాగే అనిత శస్త్రచికిత్సకు, ఆమె కోలుకునేందుకు అవసరమైన డబ్బును విరాళం రూపంలో అందజేయాలన్న ఎస్పీ పిలుపునకు పోలీస్ శాఖ ఉద్యోగులు స్పందించారు.

- రూ.4.20 లక్షల నగదును ఎస్పీ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి చేర్చేలా తిరుపతి పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు సోమశేఖరరెడ్డి కృషి చేశారు.
- దాతల సహకారంతో రూ. 2,36,200ను అనంతపురం రూరల్ పోలీసులు అందించారు. అనంతపురం రూరల్ సీఐ విజయభాస్కర్ గౌడ్, ఎస్‌ఐలు, సిబ్బంది రూ.1,36,200 విరాళాన్ని పోగు చేయగా, పోలీసుల విజ్ఞప్తి మేరకు ఆర్‌ఎం బిల్డర్స్ డెవలపర్స్ యజమానులు శివరామాంజులరెడ్డి, హరిప్రసాద్ చౌదరి మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి రూ.లక్షను చెక్కు రూపంలో అనంతపురం రూరల్ డీఎస్పీ శివారెడ్డికి అందజేశారు.
- తాడిపత్రి డీఎస్పీ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న భాస్కర్ తన నెల జీతం రూ.50 వేలను అక్కడి డీఎస్పీ గంగయ్యకు అందజేశారు. తాడిపత్రి సీఐ హమీద్‌ఖాన్, ఎస్‌ఐ ధరణీబాబు సైతం మరో రూ.50 వేలను డీఎస్పీ గంగయ్యకు అందజేశారు.
- పెద్దవడుగూరు పోలీసులు రూ. 73,300 ఆర్థిక సహాయం అందజేసినట్లు సీఐ శంకర్ రెడ్డి తెలిపారు.

వైద్యానికి కావాల్సిన డబ్బు సమకూరింది

అనిత ఆపరేషన్‌కు అవసరమైన డబ్బు సమకూరిందని జిల్లా పోలీసుశాఖ శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. సోమ, మంగళ వారాల్లో శస్త్రచికిత్స నిర్వహించనున్నారని, ఇకపై ఎవరు అనితకు సంబంధించిన ఫోన్ పే, గూగుల్ పే నంబర్లకు డబ్బు పంపవద్దని సూచించింది. ఆర్థిక సాయం అందజేసిన ప్రతి ఒక్కరికీ జిల్లా పోలీసు ఉన్నతాధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

పెళ్లి వాయిదా..
యువతి ఆత్మహత్యాయత్నం

• పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు



రోదిస్తున్న భవిత

యాడికి: వివాహ నిశ్చితార్థం జరిగి ఏడాదైనా పెళ్లి వాయిదా వేస్తుండడంతో మనస్తాపం చెంది ఓ యువతి ఆత్మహత్యకు సిద్ధమైంది. విషయాన్ని సకాలంలో గుర్తించిన స్థానికులు ఆమెను కాపాడి పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన మేరకు...యాడికి మండలం రాయలచెరువు నివాసి నారాయణ మూడో కుమారుడు చరణ్‌కు బళ్లారికి చెందిన మేనత్త కుమార్తె భవితతో ఏడాది క్రితం వివాహ నిశ్చితార్థం జరిగింది. అయితే తన రెండో కుమారుడి వివాహం తర్వాతనే చరణ్‌కు పెళ్లి చేస్తామంటూ నారాయణ దంపతులు భీష్మించారు. అప్పటి నుంచి రెండు కుటుంబాల మధ్య చర్చలు జరుగుతూ ఉన్నాయి. ఈ క్రమంలో శనివారం ఉదయం బళ్లారి నుంచి తల్లితో పాటు అనిత రాయలచెరువుకు వచ్చి పెళ్లి చేసుకుందామని చరణ్‌ను అడిగింది. అన్న పెళ్లి జరిగేంత వరకూ ఆగాలని, లేకుంటే వచ్చే మాఘమాసంలో వివాహం చేసుకుందామని చరణ్ తెలిపాడు. దీంతో మనస్తాపం చెందిన భవిత... తాడిపత్రి మార్గంలోని రైలు పట్టాలపై చేరుకుని ఆత్మహత్యకు సిద్ధమైంది. ఒంటరిగా రైలు పట్టాలపై కూర్చొని ఏడుస్తున్న భవితను గమనించిన రైతులు ఆమెను చేరుకుని ఆరా తీశారు. అనంతరం విషయాన్ని పోలీసులకు చేరవేయడంతో ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి అక్కడకు చేరుకుని అనితను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రాయలచెరువులోని చెక్‌పోస్టు వద్ద గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు తలారి నగేష్, గ్రామస్తుల సమక్షంలో ఇరు కుటుంబాలకు కౌన్సిలింగ్ ఇచ్చి ఈ ఏడాది నవంబర్‌లో భవిత, చరణ్ వివాహం జరిగేలా నచ్చజెప్పి, అనితను అప్పగించారు.

ఇద్దరు కార్యదర్శుల సస్పెన్షన్

ఉరవకొండ: ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు గ్రామకార్యదర్శులపై కలెక్టర్ గౌతమి సస్పెన్షన్ వేటు వేశారు. వివరాల్లోకి వెళితే ఆమిద్యాల పంచాయతీ కార్యదర్శి మహబూబ్‌బాషా ఇంటింటి ఓటరు జాబితా సవరణపై నిర్లక్ష్యం వహించారు. రాకెట్ల పంచాయతీ కార్యదర్శి నాగభూషణం ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో పాల్గొనకుండా సెలవుపై వెళ్లారు. దీంతో వీరిద్దరినీ సస్పెండ్ చేస్తూ కలెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

పశు వైద్యానికి పెద్దపీట

రాష్ట్ర ప్రభుత్వం పాడి పరిశ్రమకు పెద్ద పీట వేస్తోంది. ఇందులో భాగంగానే పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెడుతోంది. పశు వైద్య సేవల కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్ 1962తో పాటు అవసరమైన మందులను అందుబాటులో ఉంచింది. వైఎస్సార్ మొబైల్ వెటర్నరీ అంబులేటరీ క్లినిక్‌లు నిరంతరం పని చేస్తుండటంతో పాడిరైతులకు భరోసా లభిస్తోంది.

• 346 ఆర్‌బీకేలో 108 రకాల అత్యవసర మందులు
• 85 పశువుల ఆస్పత్రుల్లో 163 రకాల మందులతో వైద్యం
• నిరంతర సేవలో 1962 మొబైల్ అంబులేటరీ క్లినిక్‌లు





పశువుకు శస్త్రచికిత్స చేస్తున్న పశుశాఖ ఏడీ డాక్టర్ పద్మనాభం, డాక్టర్ సునీత

అనంతపురం అగ్రికల్చర్: రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు దేశంలో మరెక్కడా లేని విధంగా గ్రామ గ్రామానా ఏర్పాటు చేసిన ఆర్‌బీకే వ్యవస్థ ద్వారా ప్రభుత్వ ఫలాలు రైతు ముంగిటకే అందిస్తున్నారు. వ్యవసాయం, అనుబంధ శాఖలను ఒకే గొడుగుకు కిందకు తీసుకువచ్చి రైతుకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నారు. విత్తనం మొదలుకుని విక్రయాలు, విపత్తు సాయం వరకు ఆర్‌బీకే వేదికగానే జరుగుతుండటంతో గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు చాలా మేలు జరుగుతోంది. తాజాగా పశుసంపద, జీవసంపద పరిరక్షణకు తక్షణ వైద్యసహాయం అందించడానికి వీలుగా ఆర్‌బీకేల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచారు.

పెరిగిన పశువైద్య సేవలు

ఇటీవల పశుసంవర్ధకశాఖ ద్వారా అనంతపురం, ఉరవకొండ డివిజన్ల పరిధిలో ఉన్న 346 ఆర్‌బీకేలకు రూ.1.15 కోట్ల విలువ చేసే 108 రకాల మందులు పంపిణీ చేశారు. ఒక్కో ఆర్‌బీకేకు రూ.33 వేలు విలువ చేసే అత్యవసర మందులు అందుబాటులో ఉంచారు. సిరంజి మొదలుకుని యాంటీబయాటిక్స్ వరకు పంపిణీ చేశారు. అలాగే పశుశాఖ ద్వారా 14 గ్రామీణ పశువైద్య కేంద్రాలు (ఆర్‌ఎల్‌యూ), 56 వెటర్నరీ డిస్పెన్సరీలు (వీడీలు), 15 ప్రాంతీయ పశు వైద్యశాలల (వీహెచ్)కు కూడా ఆరు నెలలకు సరిపడా రూ.1.45 కోట్లు విలువ చేసే 163 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. ఇవన్నీ కాకుండా ఏటా సుమారు రూ.10 కోట్లకు పైగా విలువ చేసే డీవార్మింగ్ (నట్టల మందు), గాలికుంటు వ్యాధి (ఎఫ్ఎండీ), జబ్బ, పొదుగువ్యాధి, బ్రూసెల్లోసీస్, ముచ్చవ్యాధి లాంటి సీజనల్ వ్యాధుల నివారణకు ఉచితంగా టీకాలు షెడ్యూల్ ప్రకారం జరుగుతున్నాయి. జిల్లాలో 2,15,900 ఆవులు, ఎద్దులు ఉండగా, 1,89,840 గేదెలు, 22,97,300 గొర్రెలు, 4,12,094 మేకలతో పాటు పందులు, కుక్కలు, పిల్లులు, కోళ్లు, గాడిదలు, గుర్రాలు లాంటి మూగజీవాలు ఉన్నాయి.

జిల్లాలో పశు సంపద ఇలా..	
ఆవులు, ఎద్దులు	2,15,900
గేదెలు	1,89,840
గొర్రెలు	22,97,300
మేకలు, ఇతర జీవులు	4,12,094

తక్షణ వైద్య సేవలు



మూగజీవాలకు ఎలాంటి వైద్యచికిత్సలు అవసరమైనా అందించడానికి తక్షణ చర్యలు తీసుకుంటున్నాము. నియోజక వర్గ పరిధిలో వెటర్నరీ ల్యాబ్‌ల ద్వారా వివిధ రకాల రక్త, మల, మూత్ర, అవయవ పరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారణ, చికిత్సలు చేస్తున్నాము. 1962 హెల్ప్‌లైన్ ద్వారా నియోజకవర్గానికి రెండు చొప్పున వైఎస్సార్ మొబైల్ వెటర్నరీ అంబులేటరీ క్లినిక్‌లు నిరంతరం పనిచేస్తున్నాయి. పశుశాఖ డాక్టర్లు, ఏడీలు, పారాస్టాఫ్‌తో పాటు 1962 డాక్టర్లు సమన్వయంతో అరుదైన శస్త్రచికిత్సలు చేస్తుండటంతో పశుసంపద, జీవసంపద పరిరక్షణకు ఢోకా లేదు. 175 ప్రాంతాల్లో గోపాలమిత్రల ద్వారా పశువైద్య సేవలు సమర్థవంతంగా అందిస్తున్నారు.

– వై.సుబ్రహ్మణ్యం, పశుశాఖ జేడీ, అనంతపురం

వాస్తవాలు విచారణలో తేలుతాయి

• సెబ్ పోలీసు స్టేషన్‌లో వివాదాన్ని రాజకీయం చేయడం తగదు
• అనంత డిప్యూటీ మేయర్ వాసంతి, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీదేవి



మాట్లాడుతున్న వాసంతి సాహిత్య

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: సెబ్ పోలీసు స్టేషన్‌లో జరిగిన ఓ చిన్నపాటి వివాదానికి రాజకీయ రంగు పులిమి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడం తగదని అనంతపురం నగర డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీదేవి అన్నారు. శనివారం ఎస్పీ శ్రీనివాసరావును కలసిన అనంతరం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేనంతగా వైఎస్సార్‌సీపీ పాలనలోనే మహిళలకు భద్రత దక్కుతోందన్నారు. అయితే ఈ విషయాన్ని వక్రీకరిస్తూ, సెబ్ పోలీస్ స్టేషన్ ఘటనను ఎలాంటి సంబంధం లేని నేతలకు ఆపాదిస్తూ సామాజిక మాధ్యమాలను అడ్డుపెట్టుకుని వైరల్ చేస్తుండడం సిగ్గుచేటన్నారు. లిక్కర్ కొనుగోలు చేసుకుని వెళుతున్న గుజ్జల సురేష్‌ను సెబ్ పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ఓ ప్రజాప్రతినిధిగా ఆ ప్రాంత కార్పొరేటర్ సాకే చంద్ర స్టేషన్‌కెళ్లి ఘటనపై ఆరా తీసే ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. ఆ సమయంలో అక్కడి సిబ్బంది దురుసుగా వ్యవహరించడంతో వివాదానికి దారి తీసిందన్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టి వాస్తవాలు నిగ్గు తేలుస్తారన్నారు. ఈ మొత్తం ప్రక్రియ ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా అధికారికంగా జరుగుతుందని, అయితే విషయాన్ని వక్రీకరిస్తూ తమకు అనుకూలంగా మార్చుకుని రాజకీయ లబ్ధి పొందేందుకు టీడీపీ, సీపీఎం, సీపీఐ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కార్పొరేటర్ల పట్ల సెబ్ సిబ్బంది వ్యవహరించిన తీరు బాగోలేదని, ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యతనివ్వాలని కోరుతూ ఎస్పీని కలసి వినతి పత్రం ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు లీలావతి, చంద్రలేఖ, దుర్గాదేవి, లావణ్య, హసీనా, హరిత, శాంతిసుధ, కో–ఆప్షన్ సభ్యురాలు ఉమా మహేశ్వరి, సర్పంచులు పద్మావతి, ఆశాబీ, మార్కెట్ యార్డు శోభ, మహిళా నేతలు భారతి, మార్తమ్మ పాల్గొన్నారు.



రబియాబి (ఫైల్)

ప్రథమ స్వాతంత్ర్యసమరం రగిల్చిన స్వాతంత్ర్య కాంక్ష లక్షలాది మహిళలను స్వాతంత్ర్యోద్యమం వెపు నడిపింది. పూర్వీకుల అసమాన పోరాటాలను వారసత్వంగా స్వీకరించిన ముస్లిం మహిళలు 1906 నాటి స్వదేశీ ఉద్యమంతో పోరు ప్రారంభించి... ఖిలాఫత్ ఉద్యమం ద్వారా పెద్ద సంఖ్యలో జాతీయోద్యమంలో అడుగు పెట్టారు. జాతీయ కాంగ్రెస్ నిర్వహించిన సహాయ నిరాకరణోద్యమం, విదేశీవస్తు బహిష్కరణ, మద్యపాన నిషేధం లాంటి పలు కార్యక్రమాలలో బృహత్తర పాత్ర నిర్వహించారు. అలాంటి వారిలో రబియాబి ఒకరు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా సాగుతున్న 'నా భూమి– నా దేశం' కార్యక్రమాల్లో భాగంగా జాతీయోద్యమంలో పాలుపంచుకున్న మహనీయుల స్మరణలో 'సాక్షి' ప్రత్యేక కథనం. – అనంతపురం కల్చరల్:

వీర మహిళ రబియాబి

సందర్భం
'నా భూమి - నా దేశం'

• ఆంధ్రావని నుంచి తొలి ముస్లిం మహిళా సత్యాగ్రహిగా ఖ్యాతి

అణువణువున దేశభక్తిని నింపుకున్న 'అనంత' వాసులు తెల్లవారిని తరిమికొట్టి చిరస్మరణీయులుగా నిలిచారు. దేశమంతటా స్వాతంత్ర్య ప్రదీప్తి ప్రజ్వలిస్తున్నప్పుడు ఎంతో మందిలో స్ఫూర్తి రగిలించి ఆదర్శప్రాయంగా నిలిచారు. ఈ క్రమంలోనే జాతీయోద్యమంలో మేము సైతం అంటూ కట్టుబాట్లను కాదని పలువురు ముస్లిం మహిళలూ నడిచొచ్చారు. అలాంటి వారిలో అనంతపురం రూరల్ మండలం చియ్యేడు గ్రామానికి చెందిన రబియాబి ప్రథమ స్థానంలో నిలిచారు. తన భర్త మొహిద్దీన్ సాహెబ్‌తో కలసి సత్యాగ్రహంలో పాల్గొని చరిత్ర సృష్టించారు. ఆంధ్రావనిలో ఒక ముస్లిం మహిళ వ్యక్తిగత సత్యాగ్రహ ఉద్యమంలో బహిరంగంగా పాల్గొనటం ఇదే ప్రథమమని నాడు పలువురు ఆమె చర్యలను కొనియాడారు.

కొత్తచెరువుకు సరికొత్త కీర్తి

ఉమ్మడి అనంత జిల్లాకు చెందిన పుట్టపర్తి సమీపంలోని కొత్తచెరువులో 1926లో ఏప్రిల్ 4న జన్మించిన రబియాబీ.. కేవలం ఏడో తరగతి వరకు మాత్రమే చదువుకున్నారు. చియ్యేడు గ్రామానికి చెందిన దేశభక్తుడైన మొహిద్దీన్ సాహెబ్‌ను పెళ్లాడిన తర్వాత స్వాతంత్రోద్యమం పట్ల ఆకర్షితురాలై దేశమాత విముక్తి కోసం పోరుబాట పట్టింది. ఖిలాపత్, సహాయ నిరాకరణోద్యమాలు ఉధృతంగా సాగుతున్న ఆ రోజుల్లో రబియాబీ దంపతులు సాంఘిక నాటకాల ప్రదర్శనతో బ్రిటీష్ పాలకుల దమన నీతిని బహిరంగంగా ఎండగడుతూ వచ్చారు.

స్ఫూర్తి రగిల్చిన పోరాటం

స్వాతంత్ర్య సంగ్రామంలో పాలు పంచుకున్న వారి పట్ల అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం ఎంత కిరాతకంగా వ్యవహరిస్తోందో అందరూ చెబుతున్నా రబియాబీ వినకుండా అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల వేదికగా 1941, మార్చి 3న సాగిన సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొన్నారు. రాష్ట్రంలోనే ఓ ముస్లిం మహిళ పాల్గొన్న మొట్టమొదటి సత్యగ్రహం ఇదేనని అప్పట్లో ఉద్యమకారులు ఆమె ధైర్యసాహసాలను కొనియాడారు. 1942, సెప్టెంబర్ 6న వందలాది పోలీసులు చుట్టుముట్టి ఉండగా 'స్వాతంత్ర్యం మా జన్మహక్కు, భారత్ మాతాకీ జై' అంటూ నినాదాలు చేయడమే కాక చిగిచెర్ల గ్రామం వద్ద రైలు పట్టాలను ధ్వంసం చేసి అరెస్టయ్యారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా రబియాబి దంపతులు సాధారణ జీవితం సాగించారు. భర్త మొహిద్దీన్ సాహెబ్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా రబియాబీ చియ్యేడు పోస్టుమాస్టర్‌గా విధులు నిర్వర్తించారు. వారికి సంతానం లేకపోయినా ముప్పైఏళ్ల కిందట ఆమె మరణించే వరకూ ఆ గ్రామ ప్రజలనే తమ బిడ్డలుగా భావించేవారు.

నేడు సెపక్ తక్రా జిల్లా జట్టు ఎంపిక

ఉరవకొండ: త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా స్థాయి సెపక్ తక్రా పోటీలకు క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ ఆదివారం ఉరవకొండలో చేపట్టనున్నారు. ఈ మేరకు ఆ క్రీడా సంఘం జిల్లా అధ్యక్షుడు సప్తగిరి మల్లికార్జున శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా సాగే ఈ ఎంపిక ప్రక్రియను ఆ పాఠశాల హెచ్ఎం రాజేశ్వరి, షాహిన్ పర్యవేక్షించనున్నారు. ఎంపికకు హాజరయ్యే బాల, బాలికలకు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు పీడీలు మారుతీప్రసాద్, కిరణ్ పేర్కొన్నారు.

లారీ టైర్ పేలి యువకుడి మృతి



మృతుడు ఫయాజ్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: లారీ టైర్ పేలిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని కళ్యాణదుర్గం రోడ్డు జాకీర్ కొట్టాలకు చెందిన ఫయాజ్ (30)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గుత్తిరోడ్డులోని మార్కెట్ యార్డు దాటిన తర్వాత ఓ ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న పంక్చర్ షాప్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం ఉదయం 11.30 గంటలకు లారీ టైర్‌కు పంక్చర్ వేసి గాలి నింపుతుండగా ఒక్కసారిగా అది పేలడంతో ఫయాజ్ ఎగిరి గాలి మిషన్‌కు అమర్చిన ఎయిర్ సిలిండర్‌పై పడ్డాడు. తలకు సిలిండర్ బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదాన్ని గుర్తించిన వెంటనే అక్కడకు చేరుకుని ఫయాజ్‌ను పైకి లేపే ప్రయత్నం చేశారు. అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించుకుని విషయాన్ని కుటుంబసభ్యులకు, పోలీసులకు చేరవేశారు. ప్రమాదస్థలాన్ని అనంతపురం మూడో పట్టణ పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేశారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు సీఐ ధరణీకిషోర్ తెలిపారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

• జిల్లా హౌసింగ్ పీడీ కేశవనాయుడు



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ కేశవనాయుడు

గుంతకల్లు టౌన్: స్థానిక మున్సిపల్ పరిధిలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను హౌసింగ్ పీడీ కేశవనాయుడు ఆదేశించారు. గృహ నిర్మాణాల పురోగతిపై మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవానీ అధ్యక్షతన కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు, వార్డు అమినిటీ కార్యదర్శులతో శనివారం కౌన్సిల్ హాల్‌లో ఆయన సమీక్షించారు. గృహ నిర్మాణాలు నత్తనడకన సాగుతుండడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇళ్ల నిర్మాణాల్లో జిల్లాలోనే చాలా అట్టడుగుస్థానంలో గుంతకల్లు ఉందని, ఇందుకు కారణాలు ఏమిటంటూ ఆరా తీశారు. మున్సిపాల్టీ పరిధిలో 5,695 గృహ నిర్మాణాలు మంజూరు కాగా అందులో 2,480 ఇళ్లు బేస్‌మెంట్ స్థాయిలో నిలిచిపోయాయని, మిగిలినవి వివిధ దశల్లో కొనసాగుతున్నాయన్నారు. ఇప్పటికీ నిర్మాణాలను ప్రారంభించని 364 గృహాలకు సంబంధించి అనుమతులు రద్దు చేయనున్నట్లు పేర్కొన్నారు. గృహ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం రూ.1.80 లక్షలతో పాటు మెప్మా ద్వారా రూ.35 వేలు ఆర్థిక సాయం అందజేస్తోందన్నారు. ఆర్డీఓ రవీంద్ర మాట్లాడుతూ. ఈ నెలాఖరులోపు మెగా హౌసింగ్ మేళాలో భాగంగా కనీసం 500 ఇళ్లు పూర్తి చేయించేందుకు కృషి చేయాలని కౌన్సిలర్లకు సూచించారు. మాజీ చైర్మన్ జింకల రామాంజినేయులు, కౌన్సిలర్లు మెహరున్నీసా, చాముండేశ్వరి, కుమారి, సుధాకర్, సుమో బాషా, చాంద్‌బాషా, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, వార్డు ఇన్‌ఛార్జ్‌లు శేఖర్, బ్రహ్మ మాట్లాడుతూ... గృహ నిర్మాణాలు మంజూరైన లబ్ధిదారుల ఆధార్ నంబర్లు ఇతరులకు లింక్ కావడం, సకాలంలో బిల్లులు పడకపోవడం, లేఔట్లలో నీటి సమస్య, థర్డ్ ఆప్షన్ కింద ప్రభుత్వమే నిర్మించిస్తుందని భావించడం వల్ల నిర్మాణాల్లో పురోగతి లోపించడానికి కారణమయ్యాయన్నారు. సాంకేతిక సమస్యలు తీర్చాలని, డీపీఆర్‌లను వెంటనే ఆమోదించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, హౌసింగ్ ఈఈ కృష్ణారావు, డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ మారుతి, మున్సిపల్ టీపీఎస్ అబ్దుల్ సత్తార్, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌ఛార్జ్‌లు పాల్గొన్నారు.

ఫ్యాప్టో నిరసన

అనంతపురం అర్బన్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలంటూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా చైర్మన్ సిరాజుద్దీన్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి మాట్లాడుతూ.. జాతీయ విద్యావిధానం, 3, 4, 5 తరగతుల విలీనంతో ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిందన్నారు. ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనం ఇవ్వాలన్నారు. ఉద్యోగోన్నతులు, బదిలీలు చేపట్టాలని కోరారు. కస్తూర్బా పాఠశాలల్లో ఉపాధ్యాయులకు కనీస వేతన చట్టం అమలు చేస్తూ 30 శాతం వేతనాన్ని పెంచాలన్నారు. నాయకులు రఘురాంరెడ్డి, రమణారెడ్డి, సూర్యుడు, నరసింహులు, కులశేఖర్ రెడ్డి, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం



శిశువును అందజేస్తున్న ఈఎంటీ రాజేశ్వరి

ఉరవకొండ: పురిటి నొప్పులతో బాధపడుతున్న నిండు గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తుండగా 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. వివరాలు.. ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామానికి చెందిన హేమావతికి శనివారం తెల్లవారుజామున పురిటి నొప్పులు మొదలయ్యాయి. దీంతో కుటుంబసభ్యుల నుంచి సమాచారం అందుకున్న 108 సిబ్బంది.. ఆ గ్రామానికి చేరుకుని హేమావతిని ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి చేర్చారు. మూడో కాన్పు కష్టతరంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. మార్గమధ్యంలో జల్లిపల్లి టోల్‌ప్లాజా వద్దకు చేరుకోగానే నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో వాహనాన్ని రోడ్డు పక్కన ఆపించి ఆమెకు ఈఎంటీ రాజేశ్వరి కాన్పు చేశారు. పండంటి మగబిడ్డకు హేమావతి జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను క్షేమంగా కూడేరు పీహెచ్‌సీలో చేర్పించారు.

సినిమాకు వెళ్తూ.. తిరిగిరాని లోకాలకు

• బైక్‌ను ఢీకొన్న బొలెరో వాహనం
• ఇద్దరు బాలల దుర్మరణం.. మరొకరి పరిస్థితి విషమం
• పావగడ సమీపంలో ఘటన
• మృతులు రొద్దం మండలం చిన్నకోడిపల్లి వాసులు



సంఘటనా స్థలంలో ఈశ్వర్, జశ్వంత్, రాము





మృతులు జశ్వంత్ (ఫైల్), ఈశ్వర్ (ఫైల్)

రొద్దం/పావగడ: సినిమా చూసేందుకు ఉత్సాహంగా బయలుదేరిన ముగ్గురు మిత్రులు మార్గమధ్యంలోనే రోడ్డు ప్రమాదం బారిన పడ్డారు. ఇందులో ఇద్దరు దుర్మరణం చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. శనివారం ఉదయం కర్ణాటక రాష్ట్రం పావగడ సమీపంలోని కడమలకుంటె గ్రామం గేటు వద్ద జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రొద్దం మండలం చిన్నకోడిపల్లి గ్రామానికి చెందిన కురుబ అంజినప్ప కుమారుడు ఈశ్వర్ (15), కురుబ ధనుంజయ కుమారుడు జశ్వంత్(15), చాకిల పరమేష్ కుమారుడు రాము మిత్రులు. ఈశ్వర్, జశ్వంత్ పదో తరగతి, రాము ఇంటర్ చదువుతున్నారు. రెండో శనివారం సెలవు కావడంతో చిరంజీవి నటించిన భోళా శంకర్ సినిమా చూసేందుకు పావగడ వెళ్లాలని నిర్ణయించుకున్నారు. జశ్వంత్ బైక్‌పై ముగ్గురూ స్వగ్రామం నుంచి బయలుదేరారు. కడమలకుంటె గ్రామం గేటు వద్దకు రాగానే పావగడ నుంచి రొద్దం వైపు వేగంగా వెళ్తున్న బొలెరో (ఏపీ 39టీవీ 2258) వాహనం వీరి బైక్‌ను ఢీకొంది. ముగ్గురూ కింద పడిపోయారు. బైక్‌పై ఉన్న ఈశ్వర్, జశ్వంత్ తలలు పగిలి తీవ్రరక్తస్రావం కాగా, వారు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన రామును స్థానికులు పావగడ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. స్థానిక సీఐ అజయ్ సారథి సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి కారణమైన బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈశ్వర్, జశ్వంత్ మృతితో చిన్నకోడిపల్లిలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. చేతికొచ్చిన కుమారులు ఇలా అర్ధంతరంగా రోడ్డుప్రమాదంలో దుర్మరణం చెందడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

అభివృద్ధి ఓర్వలేక అక్కసు!

- ప్రతి అంశానికీ రాజకీయ రంగు పులుముతున్న టీడీపీ, పచ్చ మీడియా
- చంద్రబాబు, లోకేష్ యాత్రలకు జనం కరువవడంతో కుట్రలు
- వైఎస్సార్ సీపీకి ప్రజల్లో వస్తున్న ఆదరణను ఓర్వలేక కుతంత్రాలు
- టీడీపీ హయాంలో అరాచకాలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్న ప్రజలు


టీడీపీ హయాంలో అప్పటి మేయర్ స్వరూప సమక్షంలోనే బీసీ వర్గానికి చెందిన కార్పొరేటర్ ఉమామహేశ్వర్ రావును చితకబాదుతున్న కార్పొరేటర్ నటేష్ చౌదరి (ఫైల్)


టీడీపీ కార్పొరేటర్ సరళ బూతులు తిట్టడంతో కన్నీరు పెట్టుకుంటూ వెళ్తున్న అప్పటి కమిషనర్ సురేంద్రబాబు (ఫైల్)

అనంతపురం క్రైం: ఎన్నికలు సమీపిస్తుండడంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై బురదజల్లడమే లక్ష్యంగా టీడీపీ నాయకులు కుట్రలకు తెరతీశారు. ఆ పార్టీ అధినేత చంద్రబాబు ప్రాజెక్టుల పేరుతో చేస్తున్న పర్యటనలకు, ఆయన తనయుడు లోకేష్ పాదయాత్రకు స్పందన కరువవడంతో ఆయా ప్రాంతాల్లో అలజడి వాతావరణం సృష్టిస్తున్నారు. ఈ క్రమంలో తామేం తక్కువ అన్నట్లు నగరంలోని ఆ పార్టీ నాయకులు కుట్ర రాజకీయాలకు తెరతీశారు. ఇటీవల స్థానిక సెబ్ స్టేషన్‌లో జరిగిన ఓ ఘటనపై పచ్చ మీడియాతో కలిసి కుతంత్రాలు చేస్తుండడమే దీనికి నిదర్శనం.

విష ప్రచారం.. వీడియోలతో బహిర్గతం..

సెబ్ స్టేషన్‌లో జరిగిన ఘటనపై టీడీపీ నీచ రాజకీయాలు బహిర్గతమయ్యాయి. వాస్తవంగా నాయక్‌నగర్‌కు చెందిన సురేష్ అనే యువకుడు సాయినగర్‌లోని ప్రభుత్వ మద్యం దుకాణంలో మద్యం బాటిళ్లను కొనుగోలు చేశాడు. కానీ బాటిళ్ల విక్రయించిన వారిపై చర్యలు తీసుకోకుండా యువకుడిని సెబ్ పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు. సురేష్ తండ్రి రామకృష్ణ ఈ విషయాన్ని కార్పొరేటర్ సాకే చంద్ర దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన మరికొందరితో కలసి స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ రాధమ్మ, మరో ఇద్దరు కానిస్టేబుళ్లు..కార్పొరేటర్లను ఇష్టానుసారంగా మాట్లాడారు. సురేష్, అతని తండ్రిపై విచక్షణా రహితంగా దాడి చేశారు. ఆపై తమపైనే వైఎస్సార్ సీపీ నాయకులు దాడి చేశారంటూ అసత్య ప్రచారాలు చేశారు. ఈ క్రమంలోనే విషయాన్ని ఎలాగైనా తమకు అనుకూలంగా మార్చుకునేందుకు టీడీపీ నాయకులు కుట్రలకు తెరలేపారు. ఎల్లో మీడియా ద్వారా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తదితరులను లక్ష్యంగా చేసుకుని విష ప్రచారానికి ఒడిగట్టారు. చివరకు అక్కడ జరిగిన విషయాలన్నీ వీడియోల ద్వారా బయటకు రావడంతో పచ్చ కుట్రలు పటాపంచలయ్యాయి.

ప్రజలకన్నీ తెలుసు..!

సీఎం వైఎస్ జగన్, స్థానిక ఎమ్మెల్యే అనంతపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా నగరంలో పెద్ద ఎత్తున సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు సాగుతున్నాయి. నాలుగేళ్లలోనే రూ.2 వేల కోట్లకు పైగా ప్రజలకు లబ్ధి చేకూర్చారు. నగరంలో రూ.800 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. దీంతో ప్రభుత్వం పట్ల ప్రజలకు నమ్మకం పెరిగింది. ఇది చూసి ఓర్వలేకనే టీడీపీ నాయకులు కుట్రలకు తెరలేపారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

అరాచకాలు మరువగలమా..

టీడీపీ హయాంలో ఆ పార్టీ నాయకుల అరాచకాలకు అడ్డూ అదుపూ ఉండేది కాదు. సాక్షాత్తూ అప్పటి మేయర్ స్వరూప సమక్షంలోనే బీసీ వర్గానికి చెందిన కార్పొరేటర్ ఉమామహేశ్వర్ రావును కార్పొరేటర్ నటేష్ చౌదరి చితకబాదారు. 2018 జూలై 18న ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ మల్లీశ్వరి అనే వైద్యురాలిని చెప్పుతో కొట్టాలంటూ టీడీపీ కార్పొరేటర్ దూషించాడు. 2016 జనవరి 2న విద్యుత్‌నగర్ సర్కిల్‌లో పింఛన్ కోసం కమిషనర్‌ను అభ్యర్థించేందుకు వెళ్లిన ప్రకాష్ అనే వ్యక్తిని టీడీపీ కార్పొరేటర్లు చితకబాదారు. 2016లో సాక్షాత్తు అప్పటి మేయర్ మదమంచి స్వరూప నివాసంలోనే కమిషనర్‌గా ఉన్న ఉమామహేశ్వర రావుపై కార్పొరేటర్ దాడికి యత్నించారు. 2017 జనవరి 20న మేయర్ చాంబర్‌లో అప్పటి కమిషనర్ సురేంద్రబాబును ఎమ్మెల్యే అనుచరులు దుర్భాషలాడారు. ఆయన ఏడ్చుకుంటూ కార్యాలయం నుంచి వెళ్లిపోయిన విషయం ఇప్పటికీ సిబ్బంది గుర్తు చేసుకుంటున్నారు.

క్లుప్తంగా

ఘనంగా అంతర్జాతీయ యువజన దినోత్సవం


మాజీ సైనికులను సత్కరిస్తున్న నెహ్రూ యువకేంద్ర అధికారులు

అనంతపురం కల్చరల్: స్థానిక కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆన్‌సెట్ సీఈఓ కేశవనాయుడు, జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎన్‌వైకే అధికారి గోవర్ధన శ్రీనివాసులు ఆత్మీయ అతిథులుగా మాట్లాడారు. దేశమంతటా మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమాలు స్ఫూర్తివంతంగా సాగుతున్నాయని, ఇందులో యువత ప్రధాన పాత్ర పోషించాలని సూచించారు. దేశభక్తి ప్రబోధిత కార్యక్రమాల్లో కీలకంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా వీరోన్ కా వందన్ పేరిట మాజీ సైనికులు రాజు, వెంకటేష్, సాయిలను ఘనంగా సత్కరించారు. అనంతరం పలు చోట్ల యువతీ యువకులు 80 మొక్కలను నాటారు. కార్యక్రమంలో పలు సంస్థల ప్రతినిధులు, యువ వలంటీర్లు పాల్గొన్నారు.

'నాసా' పోటీలో సత్తా


శిరీషను అభినందిస్తున్న శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి

రాప్తాడురూరల్: అమెరికాలోని నాసా స్పేస్ సెటిల్‌మెంట్ పోటీలో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థిని సత్తా చాటింది. తాడిపత్రి బ్రాంచ్‌లో పదో తరగతి చదువుతున్న శిరీష అనంత కీర్తి ప్రతిష్టలను ప్రపంచ నలుమూలల వ్యాపింపచేసిందని చైతన్య విద్యాసంస్థల అనంతపురం జోన్ ఏజీఎం సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కమ్మ భవన్ సమీపంలోని చైతన్య పాఠశాలలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. శిరీష, తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ బాబు, విశ్వనాథ్, కోఆర్డినేటర్ రాధాకృష్ణ నాయుడు, డీన్లు నాగార్జున, నాగరాజు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పక్కాగా ఉండాలి


సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దార్

ఆత్మకూరు: పరిశీలన పక్కాగా నిర్వహించి ఓటరు జాబితాలో తప్పుల్లేకుండా చూడాలని తహసీల్దార్ ఉషారాణి తెలిపారు. శనివారం ఆమె ఆత్మకూరులో బీఎల్ఓలతో కలసి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఎల్ఓలు నిర్లక్ష్యం చేయకుండా తప్పు ఒప్పులను సరి చేయాలన్నారు. ఆర్ఐ నాగభూషణం, బీఎల్ఓలు, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రంగనాథన్‌కు నివాళి

అనంతపురం: దేశంలో మొట్టమొదటి గ్రంథాలయాధికారి రంగనాథన్ చిత్రపటానికి నివాళి అర్పించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రంగనాథన్ సేవలను పలువురు కొనియాడారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి. రమ, ఉప గ్రంథాలయాధికారి వి. సుబ్బరత్నమ్మ, సిబ్బంది ఇంతియాజ్ అహమ్మద్, కావేరి, సరస్వతమ్మ, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

అంపైరింగ్‌పై వర్క్‌షాప్


క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

అనంతపురం: జిల్లాలోని సీనియర్ సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు అంపైరింగ్‌లో నైపుణ్యాలు పెంపొందించడానికి శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఆర్డీటీ క్రీడా గ్రామంలో ఆర్డీటీ, జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. నేషనల్ సాఫ్ట్‌బాల్ అంపైర్ జగదీశ్వర రెడ్డి (గుంటూరు) మెళకువలను తెలియజేశారు. రాష్ట్ర సాఫ్ట్‌బాల్ సంఘం సీఈఓ వెంకటేశులు, అధ్యక్షుడు ఎన్. శశిభూషణ్, జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన 1,149 మెట్రిక్ టన్నుల డీఏపీ

అనంతపురం అగ్రికల్చర్: ఆర్‌సీఎఫ్ కంపెనీ నుంచి 1,149 మెట్రిక్ టన్నుల డీఏపీ ఎరువులు జిల్లాకు చేరాయి. ఈ మేరకు ఏడీఏ రవి తెలిపారు. శనివారం స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకున్న వ్యాగన్ల ద్వారా వచ్చిన డీఏపీ ఎరువులను ఆయన పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్ ద్వారా మొదటి ప్రాధాన్యతగా ఆర్‌బీకేలు, సొసైటీలకు సరఫరా చేస్తామని, మిగిలిన ఎరువులను హోల్‌సేల్, రిటైల్ డీలర్లకు, కంపెనీ గోదాములకు అందజేస్తామని వివరించారు.

ఆలయాల్లో విశేష పూజలు


శంకర మఠంలో ఉత్సవమూర్తులకు పూజలు


బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న శివాలయం సిబ్బంది


పూజలందుకున్న నిలువెత్తు వేంకటేశ్వరుడు

అనంతపురం కల్చరల్: అధిక శ్రావణ మాసంలో వచ్చిన శనివారాన్ని పురస్కరించుకుని పలు ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. నగర శివారులోని శివబాలయోగి ఆశ్రమంలో ఉదయం శ్రీవారి లడ్డూపడి పూజలు ఘనంగా జరిగాయి. నిలువెత్తు వేంకటేశ్వరుడికి భక్తులు బారులు తీరి లడ్డూలను సమర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా జూటూరు అరవింద్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. పూర్తిస్థాయి కమిటీని త్వరలో ఎన్నుకుంటామని ఆయన తెలిపారు.

- మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండరామాలయంలో నిత్యపూజల కరపత్రాలను, బ్రోచర్లను ఆవిష్కరించారు. ఆలయ ఈఓ రమేష్ బాబు, అనువంశిక ధర్మకర్త రాము మాట్లాడుతూ ఆలయంలో కొలువైన ప్రతి దేవతామూర్తికి నిత్య అభిషేకాలు, ప్రాకారోత్సవాలు, ప్రతినిత్యం హోమాలు జరుగుతాయని తెలిపారు.
- నగరంలోని శారదా శృంగేరీ శంకర మఠం, రామ్‌నగర్, ఆర్‌ఎఫ్‌రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వరాలయాలలో ఏడు శనివారాల వ్రతాలు కనులపండువగా జరిగాయి. మహిళలు బారులు తీరి వ్రతాలను భక్తిశ్రద్ధలతో ఆచరించారు.

పనులు నాణ్యతగా చేపట్టాలి


సప్తగిరి సర్కిల్‌లో పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని మేయర్ వసీం అధికారులను ఆదేశించారు. శనివారం నగరంలోని సప్తగిరి సర్కిల్‌లో జరుగుతున్న ప్యాచ్ వర్క్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో గుంతలు పడ్డ రోడ్లలో ప్యాచ్ వర్క్‌లకు శ్రీకారం చుట్టామని, ఇప్పటికే రామ్‌నగర్, సప్తగిరి సర్కిల్, అశోక్‌నగర్, తదితర ప్రాంతాల్లో పనులు పూర్తయ్యాయన్నారు. నగరాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మేయర్ వెంట కార్పొరేటర్లు బాలాంజినేయులు, అనిల్‌కుమార్ రెడ్డి, ఇస్సాక్, నాయకులు ఖాజా, ఈశ చంద్ర శేఖర్, తదితరులున్నారు.

మానవత్వం చాటుకున్న వలంటీర్లు


అనిత తల్లికి నగదు అందజేస్తున్న వలంటీర్లు

ఆత్మకూరు: మండల కేంద్రానికి చెందిన పలువురు గ్రామ వలంటీర్లు మానవత్వం చాటుకున్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ కిరణ్ మరణించిన విషయం తెలిసిందే. ఆయన భార్య అనిత ప్రస్తుతం తీవ్ర గాయాలతో బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో ఆమె వైద్య చికిత్సల నిమిత్తం శనివారం ఆత్మకూరు -1,2 సచివాలయాలకు చెందిన గ్రామ వలంటీర్లందరూ కలసి రూ.10 వేల నగదును వసూలు చేసి అనిత తల్లి నాగమ్మ, కిరణ్ తల్లి అంజినమ్మలకు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు వలంటీర్లను మెచ్చుకున్నారు.

నేడు 3కే రన్

అనంతపురం: నగరంలో ఆదివారం 3కే రన్ నిర్వహిస్తున్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 16 నుంచి 27 వరకూ విశాఖపట్నంలోని డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి స్టేడియంలో నిర్వహించనున్న జరగనున్న ఆంధ్రా ప్రీమియర్ లీగ్ సీజన్-2 లీగ్ విజయవంతం కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఎస్ఎస్‌బీఎన్ కళాశాల నుంచి సప్తగిరి సర్కిల్, టవర్‌క్లాక్ మీదుగా ఆర్ట్స్ కళాశాల వరకు 3కే రన్ ఉంటుంది. రాయలసీమ కింగ్స్ కెప్టెన్, భారత క్రికెటర్ హనుమ విహారి, భారత మహిళా క్రికెటర్ బి. అనూష, వైస్ కెప్టెన్ పి. గిరినాథ రెడ్డి, చెన్నై సూపర్‌కింగ్స్ ప్లేయర్ హరిశంకర్ రెడ్డి, రంజీ ట్రోఫీ ప్లేయర్స్ అభిషేక్ రెడ్డి, అండర్-19 భారత క్రీడాకారిణి వంశీకృష్ణ తదితరులు పాల్గొంటారు.

ముగ్గురు డీబార్

అనంతపురం: ఎస్కేయూ డిగ్రీ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడిన ముగ్గురు విద్యార్థులను డీబార్ చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. అనంతపురంలోని ఓ పరీక్ష కేంద్రంలో ముగ్గురు విద్యార్థులు పట్టుబడినట్లు పేర్కొన్నారు. పరీక్ష పరిశీలకులుగా నియమించిన వారు సకాలంలో వెళ్లకపోవడం, అనుమతి లేకుండా గైర్హాజరు కావడం, విధులు సరిగా నిర్వర్తించలేదని తమ దృష్టికి వచ్చినట్లు పేర్కొన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపిక



క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

అనంతపురం: అనంతలక్ష్మీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో మొత్తం 55 మంది విద్యార్థులకు ఉద్యోగాలు దక్కినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వి. మూర్తిరావు ఖోకలే పేర్కొన్నారు. ఆల్ సెక్ టెక్నాలజీస్ కంపెనీ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించిందన్నారు. ఎంపికైన వారు ఏడాదికి రూ.2.4 లక్షల వార్షిక వేతనం పొందుతారన్నారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను అనంతలక్ష్మీ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ అనంత రాముడు, స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ సురేంద్ర నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామమూర్తి అభినందించారు.

గిరిజనులపై దాడి దారుణం


మాట్లాడుతున్న రమేష్‌గౌడ్


అనంతపురం క్రైం: అనంతపురం సెబ్ పోలీసు స్టేషన్‌లో గిరిజనులైన సురేష్, అతని తండ్రి రామకృష్ణ తదితరులపై దాడి చేయడం దారుణమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మద్యం కొనుగోలు విషయంలో సురేష్ అనే యువకున్ని స్టేషన్‌కు తరలించడం, ఇదే విషయమై కార్పొరేటర్ సాకే చంద్ర శేఖర్ తదితరులు పోలీసు స్టేషన్‌కు వెళ్లగా కానిస్టేబుల్ రాధమ్మ ఎమ్మెల్యే పేరును ప్రస్తావించడం చూస్తే ముమ్మాటికీ రాజకీయ కుట్రను తలపిస్తోందన్నారు. న్యాయం కోసం వెళ్లిన వారిపై పోలీసులు ఏవిధంగా ప్రవర్తించారో స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఈ ఘటనపై ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిపై టీడీపీ నాయకులు విమర్శలు చేయడం తగదన్నారు. ఎమ్మెల్యే అనంత అభివృద్ధికి కేరాఫ్‌గా నిలిచారని ఆయన తెలిపారు.

ప్రశ్నించడం అలవరిచిన గద్దర్ పాట


గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కవులు, ఉద్యమ కళాకారులు

అనంతపురం కల్చరల్: అందరికీ ప్రశ్నించే తత్వాన్ని గద్దర్ పాట అలవాటు చేసిందని పలువురు కవులు, రచయితలు, ఉద్యమ కళాకారులన్నారు. శనివారం మహాబోధి కృష్ణమూర్తి, ప్రజాగాయకుడు దాసరి ఆదినారాయణ నేతృత్వంలో గద్దర్ సంస్మరణ సభ నిర్వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ అప్పిరెడ్డి హరినాథ రెడ్డి, విరసం మాజీ సభ్యులు జెట్టి జైరాం, ఆశావాది శశాంకమౌళి, మాజీ డీసీఓహెచ్ మారెప్ప, తదితరులు మాట్లాడారు. గద్దర్ జీవితం, ఎంచుకున్న విప్లవ గేయం అజరామరమన్నారు. సామాన్యులకు అండగా నిలిచే సాహిత్యం చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. కదిరి, పెనుకొండ, ఉరవకొండ, గుంతకల్లు తదితర చోట్ల గద్దర్ అనయాయులు అధికంగా ఉన్నారన్నారు. ఇక్కడి వారితో కలిసి కెనరా బ్యాంకులో పనిచేసిన విషయం గుర్తు చేసుకున్నారు. తొలుత గద్దర్ ఉద్దీపన గీతంతో దాసరి ఆదినారాయణ ఆకట్టుకున్నారు. గద్దర్ చిత్రపటానికి పుష్పాలర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో కవులు షరీఫ్, మధురశ్రీ, రియాజుద్దీన్, ప్రజానాట్యమండలి సభ్యులు రాజారామ్, ఈరన్న, పలువురు న్యాయవాదులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై విమర్శలు అర్థరహితం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్లు

అనంతపురం క్రైం: సంక్షేమం, అభివృద్ధికి పాటుపడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిపై విమర్శలు చేయడం అర్థరహితమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, ఇస్సాక్, అనిల్ కుమార్ రెడ్డి, బాబాఫృక్రుద్దీన్ అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల అనంతపురం సెబ్ స్టేషన్‌లో జరిగిన ఘటనపై టీడీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. తమ ప్రభుత్వంలో నగరంలో పెద్ద ఎత్తున అభివృద్ధి జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీకి ప్రజలు అండగా నిలుస్తారన్న అక్కసుతో ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. సురేష్ అనే యువకుడికి అండగా వెళ్లిన వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ సాకే చంద్ర, బాధితుని తండ్రి, తదితరులపై పోలీసులు దాడికి యత్నించారని, ఆ విషయాన్ని వీడియోల ద్వారా అందరూ చూశారన్నారు. కానిస్టేబుల్ రాధమ్మ వ్యవహరించిన తీరును ప్రజలు వ్యతిరేకించారన్నారు. ఎమ్మెల్యే అనంత ప్రోద్బలంతోనే కార్పొరేటర్ సాకే చంద్ర తదితరులు దాడులు చేశారనడం సరికాదన్నారు. ఎమ్మెల్యే మచ్చలేని వ్యక్తి అని అన్నారు. దాడులు, దౌర్జన్యాలు చేయించడం టీడీపీ నైజమని దుయ్యబట్టారు. టీడీపీ నాయకులు అతిగా నోరు పారేసుకుంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి పాలకులు చేసిన దారుణాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని, పింఛన్ అడిగేందుకు వెళ్లిన వికలాంగున్ని అప్పటి టీడీపీ కార్పొరేటర్ సరిపూటి రమణ, నటేష్ చౌదరిలు చితకబాదడం అందరికీ గుర్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో వాకు టీడీపీకి మరోసారి బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు రామచంద్ర, షేక్ ఖాజా, దాదు, రాధాకృష్ణ, చిన్న, సాకే కుళ్లాయస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యా విధానం రద్దుకు డిమాండ్

రాప్తాడు రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ 24వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా యూటీఎఫ్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యారంగంలో కాషాయీకరణ, వ్యాపారీకరణ, మతోన్మాద విధానాలను తీసుకొస్తోందని మండిపడ్డారు. విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాల నేతలు, విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఏకపక్ష ధోరణిపై మండిపడ్డారు. జిల్లా యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు ఎస్‌వీవీ రమణయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ విద్యారంగ వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి. గోవిందరాజులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవేంద్రమ్మ, నాగేంద్ర, మండల బాధ్యులు గంగాధర, శేషప్ప తదితరులున్నారు.

ప్రశాంతంగా పోటీలు


వక్తృత్వ పోటీలను పరిశీలిస్తున్న డీఈఓ సాయిరామ్

రాప్తాడురూరల్: 77వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు శనివారం నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ జిల్లాస్థాయి పోటీలు ప్రశాంతంగా ముగిశాయి. అనంతపురంలోని కేఎస్ఆర్ బాలికల పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 21 మంది, వక్తృత్వ పోటీల్లో 12 మంది పాల్గొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్, జిల్లా వృత్తి విద్యా అధికారి వెంకటరమణనాయక్, డీవైఈఓ పద్మప్రియ, హెచ్‌ఎంలు నారాయణ, నవీద, భాస్కర్ నారాయణ, లక్ష్మీనారాయణ, బాలాజీ పర్యవేక్షించారు. జిల్లాస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఈనెల 15న స్వాతంత్య్ర దినోత్సవంలో సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

రాప్తాడురూరల్: ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో నారాయణ స్వామి, ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి జెండాలు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలన్నారు. విద్యారంగ సమస్యలపై ఏఐఎస్ఎఫ్ రాజీలేని పోరాటాలు చేస్తోందన్నారు. ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు రామాంజనేయులు, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేష్ గౌడ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కుల్లాయిస్వామి, జి చిరంజీవి, నాయకులు ఉన్నారు.